క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు రాట పూజ



విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద రాట పూజ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శరన్నవరాత్రి ఉత్సవాలకు పట్టణంలోని విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం రాట పాతి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించినట్లు ఆలయ శాశ్వత కమిటీ సభ్యులు మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్ పర్యవేక్షణలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ అర్చకులు సుదర్శనం వేణుగోపాలచారి అర్చకత్వంలో ఆదివారం పూజలు నిర్వహించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



దాత కాశీరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు ఆదివారం రూ. 1,00,000 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన విశ్వనాధుని పెద కాశీరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

యార్లగడ్డకు నివాళి



సీపీఐ కార్యాలయంలో యార్లగడ్డ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: రైతు సంఘం రాష్ట్ర నాయకులు వైవీ కృష్ణారావు ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ కంపెనీలపై రైతులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో యార్లగడ్డ 110వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారి సోమశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఎం వసంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, మండల కార్యదర్శి కె గురవయ్య, సహాయ కార్యదర్శి టి బాబు, తక్కెళపాటి ప్రసాదరావు, మాణిక్యాలరావు, బోడ ముక్తేశ్వర్రావు, జె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అశోక్ మృతికి సంతాపం

చింతలపూడి: చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి పట్ల ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు సంతాపం తెలిపారు. ఆదివారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి అశోక్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అశోక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

డిగ్రీ కళాశాలకు ఫ్యాన్ల వితరణ


ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆ కళాశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధి ఎల్ వెంకటేశ్వరరావు 5 ఫ్యాన్లు అందజేశారు. ఆదివారం కళాశాలలో ప్రిన్స్‌పాల్ గుత్తా గిరిబాబుకు ఈ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో వసతుల కల్పనకు, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత మంది దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ రమణ, మాజీ అధ్యక్షుడు కేబీ రావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఇంజినీర్లకు సత్కారం

ఏలూరు (టూటౌన్): ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని విశ్రాంత ఇంజనీర్లు కొల్లి రాజశేఖర రావు, ముక్కామల వెంకట కృష్ణారావును సీనియర్ సిటిజన్స్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యస్ వివియస్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో అత్యున్నత సేవలు అందించిన ఇద్దరు విశ్రాంత ఇంజనీర్లను సత్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇసీఐఎల్, హైదరాబాద్‌లో డీజీఎంగా పనిచేసిన కొల్లి రాజశేఖర రావు, నీటిపారుదల శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీరుగా పనిచేసి రిటైర్ అయిన ముక్కామల వెంకట కృష్ణారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాపినీడు చౌదరి,శివరామ కృష్ణారావు, పి.ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వడ్లపట్ల నారాయణరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'దారి' చూపండి మహాప్రభో..

- వర్షాలకు ధ్వంసమైన చల్లవారిగూడెం పునరావాసకాలనీ రహదారి
- నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీస్
- సమస్యలు తీర్చాలంటూ వేడుకొంటున్న నిర్వాసితులు



చల్లవారిగూడెంలో పునరావాసకాలనీ, వర్షాలకు కోతకు గురై ధ్వంసమైన రహదారి →



జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం చల్లవారిగూడెంలో పునరావాస కాలనీ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. కాలనీకి వెళ్లే రహదారి వర్షాలకు ధ్వంసం కావడంతో వాహనాలు వెళ్లే వీలులేక నానా యాతన పడుతున్నారు. దీనికితోడు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా నిలిచిపోవడంతో వారి ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన ప్రజలకు చల్లవారిగూడెంలో స్థల సేకరణ చేసి పునరాసకాలనీ నిర్మించారు. ఆయా మండలాలకు చెందిన ప్రజలు కాలనీకి వచ్చి నివాసాలు ఉంటున్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కోతకు గురై ధ్వంసమైంది. దీంతో రాకపోకలు సాగించడానికి అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ రహదారి ప్రయాణం ప్రమాదాలకు నిలయంగా మారుతుందోని బెంబేలెత్తిపోతున్నారు.

ఆర్టీసీ సర్వీసు లేదు

ఈ కాలనీకి గత ప్రభుత్వంలో ఆర్టీసీ బస్సును నడిపేలా చర్యలు చేపట్టారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు సార్లు బస్సు సర్వీస్‌ను నడిపేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆర్టీసీ సర్వీస్ తిప్పకపోవడంతో కాలనీ ప్రజలతో పాటు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జంగారెడ్డిగూడెంలో ఉంటున్న కళాశాలలో ఈ కాలనీకి చెందిన విద్యార్థులు చదువుతున్నారు. అలాగే స్కూల్ విద్యార్థులను ఇబ్బందికర పరిస్థితుల్లో ఆటోల ద్వారా పాఠశాలలకు పంపించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాలనీ నుంచి ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం శ్రద్ధ కనబర్చడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణంతో పాటు, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకొంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కాలనీ వెళ్లే రహదారి ధ్వంసం కావడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో కాలనీకి వెళ్లేందుకు రహదారి నిర్మించి బస్సు సర్వీస్‌ను కల్పించారు. ప్రస్తుతం బస్సు సర్వీస్ నడపకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. బస్సు కోసం రెండు కిలోమీటర్ల పైనే నడిచివెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి రహదారులు నిర్మించి, బస్సు సౌకర్యాన్ని కల్పించాలి. అలాగే ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అందించాలి.

– నరసింహరావు, పునరావాసకాలనీ, చల్లవారిగూడెం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పర్రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీగణపతి టౌన్‌షిప్, కొత్తబస్టాండ్, ఏలూరు రోడ్డు, మారుతినగర్, సూర్య కాలేజ్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే బాటగంగానమ్మ ఫీడర్ పరిధిలో బాటగంగానమ్మ లే అవుట్ కాలనీ, శివాలయం వీధి, అయ్యప్పటౌన్ షిప్‌లకు ఉదయం 11 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బెండ బారెడు..



ద్వారకాతిరుమల: మండలంలోని దేవినేనివారిగూడెంకు చెందిన షేక్ ఇస్మాయేల్ ఇంటి ఆవరణలో ఒక బెండ మొక్క 13 అడుగుల ఎత్తు ఎదిగి చూపరులను అబ్బురపరుస్తోంది. స్థానికులు దాన్ని వింతగా చూస్తున్నారు. ఈ మొక్క ఇంకా ఎత్తుకు ఎదిగే అవకాశం ఉందని ఇస్మాయేల్ అంటున్నాడు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

చింతలపూడి: చింతలపూడి మండలం, యర్రగుంటపల్లి గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గ్రామంలోని పలు కూడళ్లలో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు బొజ్జ గణపయ్యను నిత్యం పూజించారు. ఆదివారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, నృత్యాలు, విచిత్ర వేషధారణలు నడుమ గణపతి విగ్రహాన్ని గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం సమీపంలోని చెరువులో భక్తుల జయజయ ధ్వానాల మధ్య గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని వాడవాడలా గణనాథుని నిమజ్జన ఊరేగింపులు నేత్రపర్వంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించి 9వరోజు కావడంతో అధిక సంఖ్యలో ఉత్సవ కమిటీలు గణనాథుని ప్రతిమలతో ఘనంగా ఊరేగింపులు నిర్వహించారు. కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయంలో స్వామి వారి ప్రతిమలను నిమజ్జనం చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులు ఎర్రకాలువ వద్ద భద్రతాపరమైన చర్యలు చేపట్టారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గణేష్ నవరాత్రులు ఘనంగా జరిగాయి. ఆదివారం 9వ రోజు ఆయా పందిళ్ల వద్ద గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు చివరి రోజు గణేష్ పందిళ్లల్లో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే గణపతికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలను వేలం నిర్వహించారు. సాయంత్రం గణేష విగ్రహాలను తీన్‌మార్ డప్పులు, డీజే, బాణసంచాల నడుమ ఊరేగింపుగా నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. స్థానిక ఎర్రకాలువ జలాశయంలో గణేష్ విగ్రహాలను నిమజ్జన చేశారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అపశృతులు లేకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

లింగపాలెం: లింగపాలెం మండల వ్యాప్తంగా గణనాథుని నిమజ్జన ఊరేగింపులు నేత్రపర్వంగా సాగాయి. ధర్మాజీగూడెంలో ఒకే రోజు 6 గణనాథుని ప్రతిమలతో ఉత్సవ కమిటీలు ఊరేగింపులు నిర్వహించడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఊరేగింపుగా వస్తున్న గణనాథులను భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీలు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

యర్రగుంటపల్లి గ్రామంలో ఊరేగుతున్న వినాయకుడు →





వేగవరంలో గణనాథుని ఊరేగింపు నిర్వహించిన దృశ్యం



లింగపాలెం: ధర్మాజీగూడెంలో గణనాథుని ఊరేగింపు నిర్వహించిన దృశ్యం



జంగారెడ్డిగూడెం: నిమజ్జనానికి గణపతి విగ్రహాన్ని తీసుకువెళుతున్న భక్తులు

అట్టహాసంగా గణేష్ నిమజ్జన వేడుకలు



ద్వారకాతిరుమల: దేవినేనివారిగూడెంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. అలాగే పలు ప్రాంతాల్లో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. అందులో భాగంగా దేవినేనివారి గూడెం బీసీ కాలనీలో నెలకొల్పిన గణేషుడి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. రాత్రి వినాయక విగ్రహాన్ని స్థానిక కోనేరులో నిమజ్జనం చేశారు. అలాగే ద్వారకాతిరుమలలోని పసరు కోనేరు వద్ద ద్వారకా శ్రీ కుంకుళ్లమ్మ తల్లి ట్రక్ ఆటో యూనియన్ వారు నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని, స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



ఆటల పోటీల కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం: యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉపాధ్యాయులకి వివిధ ఈవెంట్స్‌లో ఆటలు పోటీలు నిర్వహించినట్లు యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎండీ శ్యాంబాబు తెలిపారు. ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్లో ఫైనల్ పోటీ జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ జంగారెడ్డిగూడెం నందు నిర్వహించామన్నారు. భీమడోలు డివిజన్ టీమ్‌పై జంగారెడ్డిగూడెం డివిజన్ టీమ్ ఆరు వికెట్ల తేడాతో విజేతగా నిలిచిందని తెలిపారు. జంగారెడ్డిగూడెం డివిజన్ టీమ్‌కి ఎండీ ముషబ్బర్ నాయకత్వం వహించారు. ఈ పోటీ నిర్వహణలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ఎండీ నబి, జంగారెడ్డిగూడెం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తడాహికో, టి.రామకృష్ణ, టి.జగదీష్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి వ్యాయామం దోహదం



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్: యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించటంలో భాగస్వాములు కావాలని ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. ఏలూరు సర్ సీఆర్ఆర్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ సమీపంలో రఘు ఫిట్‌నెస్ జోన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన సీసీఎస్ సీఐ మురళీకృష్ణ విజేతలకు పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత ప్రతి రోజూ వ్యాయామం చేయటం ద్వారా మంచి శారీరక సౌష్టవంతో పాటు ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. యువత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని తెలిపారు. పోటీల్లో గెలుపు, ఓటములు సహజమేనని, కానీ విజయానికి నిరంతర శ్రమ, లక్ష్యసాధన అవసరమని చెప్పారు. యువత విలాసాలు, జల్సాలు, మద్యం, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రఘుపవన్, రహ్మత్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రాఫిక్ సార్జెంట్ వెంకటేష్

ఏలూరు టౌన్: ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సార్జెంట్‌గా ఆర్ఎస్ఐ వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్‌ను ఆయన ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. మోటారు సైకిళ్లపై ప్రయాణించే వారు విధిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. కారులో ప్రయాణించేవారు సైతం డ్రైవర్, ముందు సీట్లో ఉన్న వ్యక్తులు సీటు బెల్టు ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతూ ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితులను నివారించేందుకు చర్యలు చేపట్టాలని డీఎస్పీ సూచించారు.

సారాబట్టీలపై పోలీసుల దాడి



స్వాధీనం చేసుకున్న బెల్లపు ఊట

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రాలపై ఆదివారం కుక్కునూరు పోలీసులు దాడి చేశారు. మండలంలోని మారేడుబాక గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడిచేసి 700 లీటర్ల బెల్లపు ఊట, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. తయారీదారులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఆర్పీఐ రాష్ట్ర కార్యదర్శిగా బాబి

ఏలూరు (టూటౌన్): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర కార్యదర్శిగా ఏలూరుకు చెందిన మత్తే బాబిని నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఏలూరు వన్ టౌన్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గం ఆదేశాల మేరకు పార్టీ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు పి.అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ సంయుక్తంగా మత్తే బాబికి బాధ్యతలు అప్పగించారు.

నేత్ర సమస్యలపై అశ్రద్ధ తగదు



నేత్ర వైద్య శిబిరం ప్రారంభించి పరీక్షలను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కళ్లకు వచ్చే జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దని, అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సౌజన్యంతో ఏలూరు లయన్స్ క్లబ్ విజన్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమవరానికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్య బృందం శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 126 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా వారిలో 18 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్రచికిత్స చేయడానికి వేమవరం ఆసుపత్రికి తరలించారు. శిబిరానికి హాజరైన వారిలో 27 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు అందజేశారు. అవసరం ఉన్నవారికి ఐ డ్రాప్స్, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. దీనితో పాటు వినికిడి లోపం ఉన్న ఒక వృద్ధునికి వినికిడి యంత్రాన్ని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లవల్లి చలపతిరావు, కడియం ప్రసాద్, బచ్చు విష్ణు, లయన్స్ సభ్యులు, సామాజిక కార్యకర్తలు చెన్నా వెంకటరామయ్య, మేతర అజయ్ బాబు, బి.విఠల్ పాల్గొన్నారు.

వరదలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): కొల్లేరు వరద వల్ల వేలాది ఎకరాలు చేపలు,రొయ్యల చెరువులు ముంపునకు గురై నష్టపోయిన ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లేరు వరదల వల్ల ఆక్వా రైతులకు భారీ నష్టం వాటిల్లిందని చెప్పారు. ఏలూరు రూరల్, కైకలూరు, మండవల్లి, పెదపాడు తదితర మండలాల్లో ఆక్వా చెరువులకు ఎక్కువ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇప్పటికే ఆక్వా రైతులు తీవ్రనష్టాల్లో ఉన్నారని భారీ వర్షాల వల్ల వచ్చిన వరదల వల్ల మరింత ఎక్కువగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

దళిత మహిళపై దాడి హేయమైన చర్య

ఏలూరు (టూటౌన్): అనంతపురం జిల్లా కల్లుకుంటలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి హేయమైన చర్యగా ఏలూరు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుర్రాల రవికుమార్ ఆదివారం అభివర్ణించారు. దళిత మహిళ గోవిందమ్మను వందలాది మంది చూస్తుండగా వివస్త్రను చేసి విద్యుత్ స్తంభానికి కట్టి నీ కొడుకు అగ్ర కులానికి చెందిన అమ్మాయిని ఎలా వివాహం చేసుకుంటాడని తీవ్రంగా ఆమెపై దాడి చేయడం చాలా దురదృష్టకరమని అన్నారు. తక్షణమే నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసును నమోదు చేసి చర్య తీసుకోవాలన్నారు. హోంమంత్రి వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రవికుమార్ డిమాండ్ చేశారు.

ప్రవక్త చూపిన శాంతి మార్గంలో పయనించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన అహలే సున్నత్ వల్ జమాత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం యువత నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అలూకలరి సీతారామ రాజు స్టేడియం వద్ద ఉన్న షాదీ ఖానా వద్ద నుంచి ర్యాలీని సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎస్కే సాబీర్ హుస్సేన్ మాట్లాడుతూ లోక కల్యాణం, విశ్వశాంతి కోసం ప్రవక్త ప్రజలకు శాంతి మార్గాన్ని చూపారని, ప్రతి ఒక్కరూ ప్రవక్త చూపిన దారిలో పయనించాలని పిలుపునిచ్చారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక కర్బలా మైదానంలో సోమవారం సాయంత్రం జెండా ఆవిష్కరణ, ఆధ్యాత్మిక ప్రసంగం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అహలె సున్నత్‌వల్ జమాత్ సంస్థ కార్యదర్శి ఎండీ గాలబ్ అలీ, ప్రచార కార్యదర్శి ఎండీ ఎక్బాల్ పాల్గొన్నారు.